సాక్షి ఖమ్మం

సోమవారం ; 20 ; మే ; 2024



..బొగ్గు రవాణా నిలిపివేత

ఆర్‌సీహెచ్‌పీకి బొగ్గు టిప్పర్ల రవాణాను తాత్కాలికంగా నిలిపివేస్తూ అధికారులు, లారీ యజమానుల మధ్య అంగీకారం కుదిరింది. 8లో



21న 'చలో బస్‌భవన్'

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 21 'చలో బస్‌భవన్' కార్యక్రమం తలపెట్టినట్లు ఈయూ నేతలు తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం

37° / 27°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఉమ్మడి జిల్లాలో కేటీఆర్ పర్యటన

- ఇల్లెందు, కొత్తగూడెం, ఖమ్మంలో పట్టభద్రులతో సమావేశం



ఖమ్మంమయూరిసెంటర్ : ఖమ్మం – నల్గొండ – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉమ్మడి జిల్లాలో పట్టభద్రులతో సమావేశం కానున్నారు. ఉదయం 10 గంటలకు భద్రాద్రి జిల్లా ఇల్లెందు జేకే గ్రౌండ్స్(సింగరేణి)లో పట్టభద్రులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12గంటలకు కొత్తగూడెం క్లబ్‌లో పట్టభద్రులతో సమావేశమవుతారు. సాయంత్రం ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో పట్టభద్రులతో సమావేశమై మాట్లాడతారు. కాగా, కేటీఆర్ పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు కసరత్తు చేస్తున్నాయి. ఆదివారం ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశాలు నిర్వహించి ఈ మేరకు దిశానిర్దేశం చేశారు.

26న 'నెల నెలా వెన్నెల'

ఖమ్మంగాంధీచౌక్ : నెల నెలా వెన్నెల 82వ అభ్యుదయ సాంస్కృతిక కదంబం కార్యక్రమాన్ని ఈనెల 26వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్‌మోహన్ రావు, ఎ.సుబ్రహ్మణ్యకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారొక ప్రకటన విడుదల చేశారు. గంగోత్రి పెదకాకానికి చెందిన కళాకారుల బృందం ఆస్తికలు అనే నాటికను ప్రదర్శించనుందని తెలిపారు. ఖమ్మం నగరానికి చెందిన మాస్టర్ సంతోషి రెడ్డి బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఖమ్మం కళా పరిషత్, ప్రజానాట్యమండలి సహకారం అందిస్తున్నాయని, సామాజిక చైతన్యం కోసం నిర్వహించే నెల నెలా వెన్నెల కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నిక



పుట్టా శంకరయ్య



క్రిష్టఫర్ బాబు

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఒలింపిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశం ఖమ్మం నగరంలోని జూబ్లీ క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా వ్యవహరిస్తున్న పుట్టా శంకరయ్యను, కార్యదర్శిగా కబడ్డీ సంఘం కార్యదర్శి కె.క్రిష్టఫర్ బాబును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఉప్పల్ రెడ్డి, బీఎస్ ప్రేమ్ కుమార్, సీహెచ్ వీరభద్రం, ఈ మొగులయ్య, డాక్టర్ అనిల్ కుమార్, జాయింట్ సెక్రటరీలుగా ఎం.కృష్ణ సాయి, కె.ఆదర్శ్ కుమార్, ఓలేటి సాంబమూర్తి, ఎం.గణేష్, జి.హనుమంత రాజు, కోశాధికారిగా శ్రీనివాస రావు, సభ్యులుగా వి. నాగేంద్ర కుమార్, కె.సైదులు, కాశీ హుస్సేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర పరిశీలకులుగా ఒలింపిక్ సంఘం తరఫున మల్లారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ప్రతినిధి ఎండీ అక్బర్ అలీ, డాక్టర్ పి.రఘునందన్, ఎం.అనంతరాములు తదితరులు హాజరయ్యారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

భద్రాచలంటౌన్: వర్షాకాలం సమీపిస్తున్నందున ఆదివాసీ గిరిజన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం వస్తే ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందాలని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉంటూ గిరిజనులకు సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు.

పుస్తకాలొస్తున్నాయ్..



లారీ నుంచి పుస్తకాలను గోదాంలోకి తీసుకెళ్తున్న వర్కర్లు

జిల్లాకు 6,84,274 పాఠ్యపుస్తకాలు అవసరం

- ఇప్పటికే 2 లక్షల వరకు సిద్ధం..
- మిగతావి కూడా త్వరలోనే వస్తాయంటున్న యంత్రాంగం
- బడి తెరిచే రోజునే పుస్తకాలు అందించేలా కార్యాచరణ



గోదాంలో భద్రపర్చిన పుస్తకాలు

ఖమ్మంసహకారనగర్: నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం సైతం విద్యా వ్యవస్థకు మంచి ప్రాధాన్యత ఇస్తున్నట్టుగానే కనిపిస్తోంది. గతంలో మాదిరిగానే ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2024 – 25 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన పాఠ్య, నోట్ పుస్తకాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే జిల్లాకు పలు పుస్తకాలు చేరుతున్నాయి. నాటి ప్రభుత్వం మన ఊరు మన బడి – మన బస్తీ మన బడి కార్యక్రమం ద్వారా కొన్ని పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దగా.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మిగతా పాఠశాలలపై దృష్టి సారించింది.

పాఠ్య పుస్తకాలు వస్తున్నాయి



పాఠశాలలు వచ్చే నెల 12 నుంచి పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే జిల్లాకు పాఠ్య పుస్తకాలు వస్తున్నాయి. తొలిరోజుల్లో పుస్తకాలు అందించటం ద్వారా విద్యార్థులకు పాఠాలు వినటంతో పాటు చదువుకునేందుకు వీలుంటుంది. ఇప్పటి వరకు 2,15,920 పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరాయి. మిగతావి కూడా త్వరలో రానున్నాయి.

– ఈ.సోమశేఖర శర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

విద్యార్థులకు ఎంతో ఉపయోగం..

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్కూళ్ల పునఃప్రారంభం రోజునే పుస్తకాలు ఇవ్వాలని నిర్ణయించడంతో ఎంతగానో ఉపయోగకరమనే అభిప్రాయం తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న క్రమంలో పుస్తకాలు కూడా సకాలంలో అందితే వారు తొలినాళ్ల నుంచే చదువుపై దృష్టి సారించే అవకాశం ఉంటుందని అంటున్నారు.

తొలిరోజే పుస్తకాలు..

2024 – 25 విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో తొలిరోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో విద్యాశాఖ పరిధిలో 1,232 పాఠశాలలు ఉండగా వీటి పరిధిలో 68,653 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం ఆధారంగా విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు చేరుస్తోంది. జిల్లాలోని పాఠశాలల్లో 6,84,740 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా.. ఇందులో పార్ట్ -1కు సంబంధించి 5,17,274, పార్ట్ -2కు సంబంధించి 1,67,466 పుస్తకాలు ఉన్నాయి. కాగా ఇప్పటి వరకు పార్ట్ -1కు సంబంధించిన 2,15,920 పాఠ్య పుస్తకాలు రాగా.. మిగతా 4,68,820 పుస్తకాలు త్వరలో జిల్లాకు చేరనున్నాయి. గతేడాది నుంచి నోట్ పుస్తకాలు కూడా ఇస్తుండగా, 2023 – 24 విద్యా సంవత్సరంలో 4,19,885 నోట్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సారి కూడా అదే స్థాయిలో రానున్నాయి. కాగా ఇప్పటి వరకు 79,300 నోట్ పుస్తకాలు రాగా.. ఇందులో వైట్ నోట్ బుక్స్ 64,300, రూల్ నోట్ బుక్స్ 15వేలు ఉన్నాయి. మిగతావి త్వరలో జిల్లాకు రానున్నాయి.

'పాలేరు'కు పెద్ద కొడుకుగా ఉంటా



గొల్లపాడులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు తదితరులు

- నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా
- 'ప్రజల చెంతకే మీ శీనన్న' కార్యక్రమంలో మంత్రి పొంగులేటి
- వనజీవి రామయ్యకు పరామర్శ

ఖమ్మంరూరల్ : పాలేరు నియోజకవర్గ ప్రజలు తనను ఎంతో ఆదరించి ఇంతటి వాడిని చేశారని, వారి దీవెనలతో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రినయ్యానని, ప్రజలకు పెద్ద కొడుకుగా ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటానని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలో ఆదివారం 'ప్రజల చెంతకే మీ శీనన్న' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. తొలుత మంత్రి పొంగులేటి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి రెడ్డిపల్లిలోని శ్రీ మారెమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఏర్పడిందే ప్రజల సమస్యలు తీర్చడానికని, ఎవరికి ఏ సమస్య వచ్చినా ప్రభుత్వపరంగా, వ్యక్తిగతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాను మాయమాటలు చెప్పనని, అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని అన్నారు. తానెప్పుడూ ప్రజలతోనే ఉంటానని, వారితోనే మమేకం అవుతుంటానని తెలిపారు. వరుసగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు రావడంతో అన్ని గ్రామాల పర్యటనల్లో ఆలస్యమైందని చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిశాక సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల దరిచేర్చుతామని అన్నారు. శీనన్నా అని పిలిస్తే అండగా నిలుస్తానని తెలిపారు.

మంత్రి దృష్టికి వచ్చిన సమస్యలివే..

మంత్రి పొంగులేటి పర్యటన సందర్భంగా మంగళగూడేనికి చెందిన కాంగ్రెస్ నాయకులు కన్నేటి నర్సింహారావు పలు సమస్యలను విన్నవించారు. వెన్నారం చెరువును రిజర్వాయర్‌గా మార్చి సీతారామ ప్రాజెక్ట్ నీటితో నింపాలని, గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్ర భవనం నిర్మించాలని, వెన్నారం చెరువు నుంచి తీర్థాల వరకు ఉన్న వాగులో పూడిక తీయించాలని కోరారు. అర్హులందరికీ పక్కా ఇళ్లు నిర్మించాలని, పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు డబుల్ రోడ్ పనులు వేగవంతం చేయాలని విన్నవించారు. పల్లెగూడెంలో బుడగజంగాలకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, డ్రెయినేజీ సమస్య లేకుండా చూడాలని కోరారు. పోలేపల్లి రామాలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తేవాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇక పొంగులేటి గూడూరుపాడుకు చేరుకోగానే వర్షం ప్రారంభమైనా వానలోనే నిల్చుని ప్రజాసమస్యలను ఓపికగా విన్నారు. గొడుగుతో జనాల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు.

వనజీవికి భరోసా..

రెడ్డిపల్లిలో వనజీవి రామయ్య మంత్రి వద్దకు వచ్చి సమస్యలు విన్నవించగా నేనున్నా అంటూ భరోసా ఇచ్చారు. ఫంక్షన్‌హాల్ విషయంలో మున్సిపల్ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని మంత్రి దృష్టికి తేగా దిగులు పడొద్దని చెప్పారు. ఆరోగ్యం ఎలా ఉందంటూ ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కళ్లెం వెంకటరెడ్డి, మద్ది వీరారెడ్డి, ఎం. నిరంజన్‌రెడ్డి, మద్దినేని బేబీస్వర్ణకుమారి, ధరావత్ రాంమూర్తి నాయక్, మద్ది కిషోర్ రెడ్డి, మల్లారెడ్డి, కన్నేటి వెంకన్న, బత్తుల కూర్మారావు, బండి జగదీష్, బోడా వెంకన్న, భుజంగరెడ్డి, సీపీఐ నాయకులు పుచ్చకాయల. కమలాకర్, లింగా వెంకటనారాయణ, పుచ్చకాయల సుధాకర్, లూరి భాస్కర్‌రావు, సిద్దినేని కర్ణకుమార్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం కోసం పోరాడాలి



కవాతు నిర్వహిస్తున్న రెడ్‌షర్ట్ వలంటీర్లు

- కార్మికులు, కర్షకులు ఐక్యం కావాలి
- తెలంగాణ గొప్ప ఉద్యమ భూమి
- కేరళ మాజీ మంత్రి శైలజ



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శైలజ టీచర్, పక్కన తమ్మినేని

ఖమ్మంమయూరిసెంటర్ : దేశంలో ఇంకా ఎంతో మంది నిరక్షరాస్యులు, అంటరానివారు ఉన్నారని, పాలకుల విధానాలతో వారు అనేక బాధలు పడుతున్నారని, ప్రజాస్వామ్యం కోసం ప్రజలు పోరాటాలు చేయాలని కేరళ మాజీ మంత్రి కే.కే. శైలజ టీచర్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్మించిన ఖానాపురంహవేలి కార్యాలయం(సత్తెనపల్లి రామకృష్ణ భవన్)ను పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు. తొలుత సీపీఎం జిల్లా కార్యాలయం నుంచి రెడ్ షర్ట్ వలంటీర్లతో భారీ కవాతు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో శైలజ టీచర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు కార్మికులు, కర్షకులు ఏకం కావాలన్నారు. కమ్యూనిస్టు ప్రభుత్వం ఉన్న కేరళలో విద్య, వైద్య రంగాల్లో సంస్కరణలు తీసుకొచ్చామని, అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రం కేరళేనని అన్నారు. బూర్జువా పార్టీల పాలనలో పెట్టుబడిదారులు మరింత సంపన్నులుగా ఎదుగుతున్నారని, పేదలు మరింత పేదరికంలోకి వెళుతున్నారని అన్నారు. దోపిడీ, అసమానతలు, ఆకలి సమస్యలు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని, కమ్యూనిస్టులు ఉంటారని చెప్పారు. ఈ అసమానతలకు పరిష్కారం కార్మికవర్గ రాజ్యస్థాపనేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రం గొప్ప పోరాట భూమి అని, ఇక్కడ పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం లాంటి నాయకుల పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ కమ్యూనిస్టు కార్యాలయాలు అంటే ప్రజా సమస్యల పరిష్కార వేదికలుగా నిలుస్తున్నాయని తెలిపారు. కరోనా కాలంలో రాష్ట్రంలో మొదట ప్రజల ముందుకొచ్చి వైద్య కార్యక్రమాలు నిర్వహించింది తమ పార్టీయేనని చెప్పారు. సీపీఎం ఖానాపురం హవేలి కార్యదర్శి దొంగల తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ రాష్ట్ర నాయకులు బి.వెంకట్, ఎం.సాయిబాబు, పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, నాయకులు పి. సోమయ్య, ఎర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, వై.విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, భూక్యా వీరభద్రం, సత్తెనపల్లి మంగ, ఎస్.నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు శైలజ టీచర్‌కు పలువురు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు..

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు

వైరా: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదులు అధికారంలోకి రావడానికి నీచంగా దిగజారి చౌకబారు మాటలు మాట్లాడుతున్నారని, దేవుడిని అడ్డం పెట్టుకుని మత విద్వేషాలు రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అయోధ్య రామాలయం కూల్చేస్తారంటూ ప్రధాని మోదీ ప్రజలను భయాందోళనలకు గురిచేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైరా అమరవీరుల నగర్‌లో మాస్‌లైన్ జిల్లా రాజకీయ శిక్షణా తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మణిపూర్, గుజరాత్‌లో మైనార్టీలు, దళితులు, ఆదివాసీలను దారుణంగా చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి పదేళ్ల కాలంలో ఉన్న ఉద్యోగాలు తొలగించారని ఆరోపించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చడం ఖాయమన్నారు. మత ఛాందస శక్తులను ఉసిగొల్పుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. దేశంలో పౌర హక్కులను కాపాడుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా పోరాడి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ కూటమిని ఓడించాలని పిలుపునిచ్చారు. శిక్షణ తరగతుల్లో పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, కేంద్ర కమిటీ సభ్యుడు కె.జి. రామచందర్ ప్రసగించగా, సీ వై పుల్లయ్య ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. నాయకులు కె.అర్జునరావు, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, జి రామయ్య, అవుల అశోక్, వెంకటరెడ్డి, శివలింగం, శిరోమణి, లలిత, ఝాన్సీ, లక్ష్మి, శ్రీనివాస్, లాజర్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, అప్పారావు, సత్యం, వెంకటేశ్వర్లు, లాలమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎకో టూరిజమే లక్ష్యం !

- పర్యాటక కేంద్రాల అభివృద్ధికి డీపీఆర్
- తద్వారా జిల్లా యువతకు ఉపాధి
- జంతువుల వేట, పోడు సాగుకు అడ్డుకట్ట
- హరితహారం ద్వారా 30 లక్షల మొక్కల పెంపకం

'సాక్షి' ఇంటర్వ్యూలో డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్



ఖమ్మంవన్‌టౌన్: 'జిల్లాలో ఉన్న అడవులను సంరక్షించి జీవ వైవిధ్యానికి బాటలు వేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. జిల్లాలో ఉన్న అడవుల విస్తీర్ణం ఏ మాత్రం తగ్గకుండా చూస్తూనే సింగరేణి, నగరపాలక సంస్థ, డీఆర్‌డీఓ, ఇతర ప్రభుత్వ సంస్థల, అధికారుల సహకారంతో పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు హరితహారం ద్వారా ఏటా మొక్కలు నాటుతున్నాం. ఈ ఏడాది సైతం 31.06 లక్షలకు పైగా మొక్కలను నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే మొక్కలు నాటేందుకు అటవీ నర్సరీల్లో సిద్ధం చేశాం. అడవులు, అడవుల్లో ఉండే జంతుజాతులను సంరక్షిస్తూనే ప్రజలు ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు ఎకో టూరిజం ప్రాజెక్టుకు డీపీఆర్‌లు ప్రభుత్వానికి పంపిస్తాం' అని జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ వెల్లడించారు. ఆదివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు. అవి ఆయన మాటల్లోనే..

మంటలు చెలరేగకుండా జాగ్రత్తలు..

ఈ ఎండాకాలం చాలా అప్రమత్తంగా వ్యవహరిస్తూ వచ్చాం. ఇప్పటి వరకు జిల్లాలోని ఏ డివిజన్‌లో భారీ అగ్ని ప్రమాదం జరగలేదు. ఎక్కువగా భూ అక్రమణదారులు, వేటగాళ్ల వల్ల, వాహనదారులు బీడీలు, సిగరెట్లు తాగి పడేయడం వల్లే అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికి అడ్డుకట్ట వేసేందుకు అడవులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నాం. ఆయా ప్రాంతాల్లోని ప్రజలను ఆ దిశగా చైతన్యవంతం చేస్తున్నాం. ఇటీవల ఖమ్మం వెలుగుమట్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో అర్ధరాత్రి వేగంగా వీచిన గాలులతో మంటలు లేచాయి. సమాచారం అందగానే అప్రమత్తమై కలెక్టర్ వీ.పీ. గౌతమ్, నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, మా ఎఫ్‌డీఓల సమన్వయంతో ఫైరింజన్, గ్రామపంచాయతీల వాటర్ ట్యాంకర్‌ల ద్వారా నీరు తెప్పించి మంటలను అదుపులోకి తెచ్చాం.

వన్యప్రాణులకు తాగునీటి వసతి

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అడవుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. అధికారులు, బేస్‌క్యాంపు సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ నిత్యం ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. అడవుల్లో విస్తృతంగా బోర్లు వేశాం. వాటికి సౌర విద్యుత్ ఏర్పాటు చేసి గుంతల్లో (సాసర్ పిట్లు) నీరు నింపుతాం. సహజంగా ఉండే వాగులు, వంకలలో ఉన్న నీరు ఎండిపోయినప్పు డు కృత్రిమంగా బోర్ల ద్వారా నీటిని అందిస్తున్నాం.

పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై..

జిల్లాలో పులిగుండాల ప్రాజెక్ట్, నీలాద్రి దేవాలయం, నీలాద్రి అర్బన్ పార్క్, కనిగిరి హిల్ వ్యూ, పల్లెర్ల బావి వ్యూ పాయింట్, కాకతీయుల నాటి పురాతన దేవాలయాలను ఎకో టూరిజం ప్రాజెక్ట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు (డీపీఆర్) రూపొందించి రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు పంపించాం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి సహాయ సహకారాలతో త్వరలోనే అనుమతులు సాధిస్తాం. ప్రజలు ట్రెక్కింగ్ చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించేలా పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తాం. ఈ ఎకో టూరిజం ప్రాజెక్ట్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయి.

పులి, ఏనుగు తప్ప అన్నీ..

జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో పులులు, ఏనుగులు తప్ప అన్ని జీవజాతులు ఉన్నాయి. వీటిని సంరక్షించేందుకు మా బృందాలు నిరంతరం రెండు డివిజన్లలో ఉన్న అన్ని బీట్లలో గస్తీ తిరుగుతూ ఉంటాయి. వేటగాళ్ల బారిన వన్యప్రాణులు పడకుండా ఎవరైనా కొత్తగా, అనుమానాస్పదంగా కనిపించినా వారిని ప్రశ్నిస్తారు. అదేవిధంగా సరిహద్దుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో శాటిలైట్ లింకు ద్వారా సైరన్ వస్తుంది. ఆ వెంటనే మా సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. మధిర ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ నుంచి కొందరు వేటకు వస్తుండడంతో నిఘా మరింత పెంచాం.

అడవుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

అడవుల సంరక్షణకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. జిల్లాకు వచ్చే సరిహద్దులతో పాటు, ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని శాటిలైట్‌కు లింక్ చేశాం. దాని ద్వారా మొత్తం మానిటరింగ్ చేస్తున్నాం. విలువైన అటవీ సంపదను రక్షించేందుకు నిత్యం గస్తీ బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలోనే ఉండే విధంగా చూస్తున్నాం. పోడుదారులు పోడుకొట్టి అటవీ భూమిని అన్యాక్రాంతం చేయకుండా చూస్తున్నాం.

'మా ఊర్లో మా రాజ్యం' ఉద్యమం

ఆదివాసీ జేఏసీ నేత చందా లింగయ్య



మాట్లాడుతున్న చందా లింగయ్య దొర

మణుగూరు టౌన్: మా ఊర్లో మా రాజ్యం స్థాపన కోసం ప్రత్యేక ఉద్యమం చేపడతామని జాతీయ ఆదివాసీ నేత, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి చందా లింగయ్య దొర పేర్కొన్నారు. ఆదివారం తొగ్గూడెం సమ్మక్క–సారలమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ ఆదివాసీలను విస్మరించి లంబాడా తెగకు మాత్రమే టికెట్లు ఇచ్చాయని ఆరోపించారు. ఆదివాసీలకు అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ ఎన్నికల ఫలితాల అనంతరం పోరాటం చేస్తామన్నారు. నాయకులు వట్టం ఉపేంద్ర, అలెం కోటి, ముక్తి రాజు, కొడెం వెంకటేశ్వర్లు, పాయం సత్యనారాయణ, పొడుగు శ్రీనాథ్ రమణాల లక్ష్మయ్య, వట్టం నారాయణ, పొడెం రత్నం, వాసం కృష్ణయ్య, పొడెం కృష్ణ ప్రసాద్, వజ్జా నర్సింహారావు, వర్స శ్రీను, చందా మహేశ్, బుర్రా యాదగిరి, చింత కృష్ణ, కుంజా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సోమ్లానాయక్‌కు డిప్యూటీ సీఎం పరామర్శ



సోమ్లానాయక్‌ను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

ఖమ్మంవన్‌టౌన్: హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు సోమ్లానాయక్‌ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సోమ్లానాయక్‌కు మెరుగైన వైద్యం అందించాలని, ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని వైద్యులకు భట్టి సూచించారు.

ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలి



సంఘం సభ్యులతో డాక్టర్ భైరి నరేశ్

ఖమ్మంమామిళ్లగూడెం: ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ భైరి నరేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం పూలే, అంబేడ్కర్ అధ్యయన వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకూ ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని, అనేక కారణాలతో చాలామంది తనువు చాలిస్తున్నారని చెప్పారు. ఆత్మహత్యల నివారణపై ఏమాత్రం ఆలోచించకపోవడం బాధాకరమని, మూఢ నమ్మకాలతో పాటు సమాజం ఎదుర్కొనే అనేక సమస్యలపై సంఘం సభ్యులు నిరంతరం ప్రజలని చైతన్య పరచాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రీతి సంఘర్షణ, పాడకంటి రాంబాబు, లింగబోయిన లక్ష్మణ్, దార వెంకన్న, కోయిని వెంకన్న, రాఘవులు, గురుమూర్తి, బిక్కులాల్‌నాయక్, శివాజీ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తికి గాయాలు

అన్నపురెడ్డిపల్లి: రైలు పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తిని గూడ్స్ రైలు ఢీకొట్టిన ఘటనలో గాయాలైన సంఘటన మండల పరిధిలోని శాంతినగర్ గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన వెంకటకృష్ణ(35) ఆదివారం తెల్లవారుజామున రైలు పట్టాలను దాటుతూ బహిర్భూమికి వెళ్తున్నాడు ఈ క్రమంలో అటుగా వస్తున్న గూడ్స్ రైలును గమనించకపోవడంతో వెంకటకృష్ణను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి కుడి కాలు విరగగా.. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది నాగేంద్రబాబు, రాజా క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రైవేటు కళాశాలల జయకేతనం

బీఆర్క్, బీప్లానింగ్‌లో సత్తా చాటిన విద్యార్థులు

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పేపర్–2 (బీఆర్క్, బీప్లానింగ్) ఫలితాల్లో ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించి సత్తా చాటారు. – ఖమ్మంసహకారనగర్

■ కృష్ణవేణి సత్తా..



విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణవేణి డైరెక్టర్లు జగదీశ్, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు

జేఈఈ మెయిన్స్ పేపర్–2లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించి విజయకేతనం ఎగురవేశారని కృష్ణవేణి కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీశ్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం కళాశాలలో వారు విద్యార్థులను అభినందించి మాట్లాడారు. డి.సోనియా 7వ ర్యాంక్, ఎం.మోహిత్ 72, ఎ.ప్రణీత్‌పవర్ 149, ఎం.ఉజ్వలమానస 390, పి.నవదీప్ 462, ఎం.శశాంక్ 487, జి.కార్తీక్ 586, వై.ఉమేశ్ చంద్రన్ 648, ఆర్.మేఘన 751, పి.రోహిత్‌కుమార్ 821, ఎ.హర్షిత్ 1,029, ఎస్.ప్రియదర్శిని 1,212, బి.వరుణ్ 1,413, డి.ప్రేమ్‌కుమార్ 1,592, ఎల్.సాయికుమార్ 1,644, బి.భరత్‌కుమార్ 1,682, బి.విశాల్ 1,838, బి.చరణ్ 1,873, జి.రోహిత్ 2,138, డి.జయశ్రీ 2,283, డి.అచ్యుత్ 2,354, బి.ఇందుమతి 2,385, బి.ప్రియాంక 2,399, బి.శ్రీనివాస్ 2,455, జి.స్మైలీ 2,456, బి.దినేశ్ 2,538, బి.రామ్‌చరణ్‌తేజ్ 2,623, డి.అరవింద్ 2,996వ ర్యాంక్ సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్రయ్య, అకడమిక్ ఇన్‌చార్జ్ వంశీకృష్ణ, ఏఓ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

■ హార్వెస్ట్ ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హార్వెస్ట్ కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి

జేఈఈ మెయిన్స్ పేపర్–2లో తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించి ప్రతిభ కనబర్చారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. ఆదివారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను వారు అభినందించి మాట్లాడారు. ఎ.రాహుల్‌పృథ్వీ, బీఆర్క్‌లో 24వ ర్యాంక్, వి.సత్యతథాగత్ 297వ ర్యాంక్, వి.ప్రశాంత్ 40వ ర్యాంక్, జి.చిన్మయి 85, ఆర్.అమూల్య 237, బి.హైందవి రాథోడ్ 335, డి.సంతోష్ 382, ఎస్.కరుణశేఖర్ 403, బి.ఈశ్వర్‌కీర్తన్ 455, పి.హేమశ్రీ 737, బి.కార్తీక 750, ఎస్.అరవింద్ సన్ని 792, జి.సాయి సుచరిత 915, ఎం.నాగఫణి 939, ఎస్.తపస్వీ 962వ ర్యాంక్ సాధించారన్నారు. ప్లానింగ్ విభాగంలో బి.కార్తీక 271వర్యాంక్ సాధించారని చెప్పారు.

■ రెజొనెన్స్ ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న రెజొనెన్స్ డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు

జేఈఈ మెయిన్స్ పేపర్–2 (బీఆర్క్) ఫలితాల్లో తమ విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంక్‌లు సాధించారని రెజొనెన్స్ కళాశాలల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు తెలిపారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను వారు అభినందించి మాట్లాడారు. జె.శ్రీకాంత్ 10వ ర్యాంక్, జీవన్‌కుమార్ 645, ఆఫనాన్ ఫైసల్ 1,217, కె.హర్షవర్ధన్ 1,699, సాయిచరణ్ 1,865, బి.సరిత 1,962, బి.వినాయక్ 2,023, జి.కేశవ్‌కుమార్ 2,403, డి.రిషిక్ 2,608, హేమలత 2,751, సాయి గాయత్రి 4,127, అంజాద్ 5,732, లాస్యశ్రీ 5,799వ ర్యాంక్ సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సతీష్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ శ్రీచైతన్య అగ్రగామి



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

జేఈఈ మెయిన్స్ పేపర్–2 (బీఆర్క్, బీప్లానింగ్) ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించి అగ్రగామిగా నిలిచారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఆదివారం విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ టి.యజ్ఞశ్రీ బీఆర్క్‌లో ఆలిండియా స్థాయిలో 3వ ర్యాంక్, డి.శైలజ 5వ ర్యాంక్, ప్లానింగ్ విభాగంలో డి.శైలజ 3వ ర్యాంక్ సాధించారు. ఎం.నవీన్ 17వ ర్యాంక్, టి.యజ్ఞశ్రీ 28, బి.వెంకట మణిరామ్ 53, కె.నవదీప్‌కిరణ్ 53, డి.శ్రీసాత్విక్ 54, టి.శ్రీరామ్‌తేజ 64, కె.శ్రీపూజిత 80, పి.సాయిదినేశ్‌రెడ్డి 96, ఎం.సాయిఅన్విత 98, డి.శైలజ 107, ఎస్‌బీ వర్షితకౌండిన్య 108, డి.శైలజ 114వ, డి.శ్రీసాత్విక్ 200, జి.రిషిరాజ్ 213, పి.రఘునాథ్ 228, పి.జాహ్నవి 231, జి.కీర్తన 257వ ర్యాంకు సాధించారన్నారు. అకడమిక్ డైరెక్టర్ బి.సాయిగీతిక, డీజీఎం చేతన్‌మాథుర్, డీన్ ఎన్ఆర్ఎస్‌డీ వర్మ, ఏజీఎంలు బ్రహ్మం, జి.ప్రకాష్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

■ న్యూవిజన్ ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న న్యూవిజన్ చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్ గోపీచంద్, అకడమిక్ డైరెక్టర్ కార్తీక్

జేఈఈ మెయిన్స్ పేపర్–2 (బీఆర్క్) ఫలితాల్లో తమ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో సత్తా చాటారని న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ తెలిపారు. విద్యార్థులను అభినందించాక ఆయన మాట్లాడారు. బి.ప్రభంజన్ జాదవ్ ఆలిండియా స్థాయిలో 1వ ర్యాంక్, కె.వర్షిత్ 13వ ర్యాంక్, డి.మురళీకృష్ణ 28, జి.శ్రీరామ్ 41, జి.మహస్వీ 48వ ర్యాంక్ సాధించారన్నారు. డైరెక్టర్ సీహెచ్ గోపీచంద్, అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీహెచ్‌పీకి బొగ్గు రవాణా నిలిపివేత



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందిస్తున్న లారీ యజమానుల సంఘం నాయకులు

సత్తుపల్లి: కొత్తగూడెం ఆర్‌సీహెచ్‌పీకి బొగ్గు టిప్పర్ల రవాణాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఒక అంగీకారం కుదిరింది. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే మట్టా రాగమయి సమక్షంలో సింగరేణి అధికారులు, లారీ యజమానులతో ముఖాముఖి చర్చలు జరిగాయి. ఆర్‌సీహెచ్‌పీకి బొగ్గు రవాణాను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదంటూ లారీ యజమానులు స్పష్టం చేయటంతో ఎమ్మెల్యే సూచనలతో ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్లు సింగరేణి అధికారులు పేర్కొన్నారు. బొగ్గు లారీల లోడింగ్ పెంచే వరకు లోడింగ్‌లకు వెళ్లేది లేదంటూ లారీ యజమానులు చెప్పటంతో పరిశ్రమల నుంచి కొనుగోలు ఆర్డర్ లేనప్పుడు లోడింగ్‌లు ఎలా ఇస్తామని సింగరేణి అధికారులు చెప్పటంతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది.

మంత్రి పొంగులేటికి విన్నపం..

రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆదివారం లారీ యజమానులు ఖమ్మంలో కలిసి సమస్యలను విన్నవించారు. అధికారులతో చర్చించి చెబుతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో లారీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కొండపల్లి రమేశ్‌రెడ్డి, ఎస్‌కే కీజర్, పీఎల్ ప్రసాద్, చిన్నంశెట్టి సూరిబాబు, వేముల విశ్వనాథం, నడిపల్లి రాంబాబు, ఎస్‌కే రఫీ, ఎస్‌కే లియాకత్, నజీర్, ఎస్‌కే రెహ్మాన్, ఎస్‌కే బాజీ తదితరులు పాల్గొన్నారు.

‘చలో బస్‌భవన్’ను జయప్రదం చేయండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వంలో టీఎస్ ఆర్టీసీని విలీనం చేసే ప్రక్రియను పూర్తి చేయాలని, 2013 పీఆర్‌సీకి సంబంధించిన బాండ్ డబ్బులు వెంటనే కార్మికులకు చెల్లించాలనే సమస్యలపై ఈ నెల 21న తలపెట్టిన ‘చలో బస్‌భవన్’కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పాటి అప్పారావు పిలుపునిచ్చారు. ఆదివారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఖమ్మం కొత్త బస్టాండ్‌లో డ్రైవర్లకు, కండక్టర్లకు, సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాజమాన్యం ఉద్యోగులను విభజించి పాలించే చర్యలు చేపడుతోందని, వేతనాల చెల్లింపులో దశలవారీ విధానం అవలంబిస్తోందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అన్యాయంగా సస్పెండ్, రిమూవైన ఉద్యోగుల కేసులను పునఃపరిశీలించి న్యాయం చేయాలని కోరారు. మహిళా కార్మికులు రాత్రి 8 గంటల లోపు విధుల నుంచి దిగేవిధంగా విధులు కేటాయించాలని, మహాలక్ష్మీ రద్దీని తట్టుకునే విధంగా బస్సులు, కార్మికుల సంఖ్యను పెంచాలనే తదితర డిమాండ్లతో 21న ‘చలో బస్‌భవన్’ను చేపట్టామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో యూనియన్ ఖమ్మం రీజియన్ కార్యదర్శి పిల్లి రమేశ్, ఖమ్మం డిపో అధ్యక్ష, కార్యదర్శులు దేశబోయిన జగన్నాథం, బేతంపూడి బుచ్చిబాబు, డిపో ట్రెజరర్ దామాల లాజర్, నాయకులు వెంపటి గోవర్ధన్, ప్రదీప్‌కుమార్, చెన్నారెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా మంచానికే పరిమితం..

- రోడ్డు ప్రమాదంలో నడుముకు గాయం
- తండ్రి కూలికెళ్తేనే ఇల్లు గడిచేది..
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న కుటుంబీకులు

దీనగాథ



మంచానికే పరిమితమైన నాగుల్‌మీరా

చంద్రుగొండ: డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించే ఓ వ్యక్తికి ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంతో రెండేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. ఈనేపథ్యాన భార్య పుట్టింటికి వెళ్లిపోగా వృద్ధాప్యంలో ఉన్న ఆ వ్యక్తి తల్లిదండ్రులే అతడిని సాకుతున్నారు. కూలీ వెళ్తేనే గడవని ఆ కుటుంబం పరిస్థితి శస్త్ర చికిత్స చేయించేందుకు డబ్బులు లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. చంద్రుగొండ శివారు ఇందిరానగర్‌కు చెందిన ఎస్‌కె.నాగుల్‌మీరా లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. పాల్వంచకు చెందిన ఓ యువతితో గత నాలుగేళ్ల క్రితం వివాహం కాగా వీరికి మూడేళ్ల వయసున్న ఇద్దరు ఆడ కవల పిల్లలు ఉన్నారు. అంత బాగానే ఉన్న సమయాన విధి వక్రీకరించి గత రెండేళ్ల క్రితం తన ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడడంతో నాగుల్‌మీరాకు నడుము విరిగింది. ప్రాథమిక చికిత్స అనంతరం అతడికి శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో నాగుల్‌మీరాను తన భార్య వదిలేసి పిల్లలతో తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో వృద్ధాప్యంలో ఉన్న తల్లి ఇమాంబీ, తండ్రి అజ్గర్ ఇద్దరే నాగుల్‌మీరాను సాకుతున్నారు. ఇటీవల ఈ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నాగుల్‌మీరాకు వైద్యం చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు..

వైద్య సాయం పొందేందుకు ఆపన్నహస్తం కోసం నాగుల్‌మీరా కుటుంబీకులు ఎదురుచూస్తున్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణ ప్రభుత్వం తరఫున వైద్యం జరిగేలా కృషి చేస్తానని చెప్పినప్పటికీ కనీసం ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో అతడు ఇంట్లోనే నిస్సహాయస్థితిలో కాలం వెళ్లదీస్తున్నాడు. నాగుల్‌మీరాకు సాయం చేసేవారు ఫోన్ పే లేదా గూగుల్ పే నంబర్ 97038 90408కు ఆర్థిక సాయం అందించాలని ఇందిరానగర్ వాసులు కోరుతున్నారు.

కర్రసాములో గురుదేవ్ విద్యార్థుల సత్తా..



కర్రసాములో ప్రతిభ చాటిన విద్యార్థులు

చర్ల రూరల్: వరల్డ్ యూనియన్ సిలంబం ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈనెల 17, 18, 19 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన ఏషియన్ చాంపియన్‌షిప్ సిలంబం (కర్రసాము) పోటీల్లో చర్ల గురుదేవ్ విద్యాలయం విద్యార్థులు సత్తా చాటారు. సింగిల్ స్టిక్ విభాగంలో సీహెచ్.దేవి, భవ్యశ్రీ , ఎం.నిత్య నందిత, ఎస్‌కె.తహీరలు మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారు. అలాగే టి.సాహితి, బి.మాధురిలు కాంస్య పతకాలు సాధించారు. ఈమేరకు గురుదేవ విద్యాలయంలో గత ఏడాది కాలంగా విద్యార్థులకు కర్రసాములో శిక్షణ ఇచ్చిన మామిడి హారిక, పీఈటీ రామకృష్ణ, విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్‌జీవీ గిరి, అకడమిక్ కో ఆర్డినేటర్లు ఎంవీ సుబ్రహ్మణ్యం , జి.శ్రీనివాస్, ఎంఈఓ ఝుంకీలాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

మామపై అల్లుడి హత్యాయత్నం

పాల్వంచ: మామపై ఓ అల్లుడు కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ప్రభాత్‌నగర్‌కు చెందిన సామా రవీందర్‌రెడ్డి తన కూతురు వైష్ణవిని మణుగూరుకు చెందిన రవిచంద్రారెడ్డికి గత ఏడాది కిందట వివాహం జరిపించాడు. వివాహం అయిన నెల రోజుల నుంచి రవిచంద్రారెడ్డి తన భార్యను తరచూ వేధింపులకు గురి చేస్తున్నాడు. కాగా, ఇటీవల వారికి పాప పుట్టడంతో వైష్ణవి పుట్టింటికి వచ్చింది. ఈనెల 11వ తేదీ రాత్రి సమయాన రవిచంద్రారెడ్డి గోడ దూకి వచ్చి మామ రవీందర్‌రెడ్డిని కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు ఆదివారం వైష్ణవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తన భర్తతో పాటు అత్తమామలు రామిరెడ్డి, సరిత, ఆడబిడ్డ కీర్తలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: చర్లలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ఆదివారం చర్లలో జరిగే వారపుసంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, కుమా జిల్లాల నుంచి పెద్దఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా.. వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియన్లు, సానుభూతిపరులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన తాలిపేరు ప్రాజెక్టు రోడ్డు, లెనిన్‌కాలనీ, కలివేరు క్రాస్‌రోడ్డు, కుర్నపల్లి రోడ్డులలో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు వచ్చి పోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా అనుమానితులుగా భావిస్తూ పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించి నిర్ధారించుకున్న తరువాత వారిని విడిచిపెట్టారు. సీఐ రాజువర్మ నేతృత్వంలో ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి తనిఖీలను కొనసాగించారు.

నిధులు నిల్..!



ఇల్లెందు ప్రభుత్వ ఏరియా వైద్యశాల



డీజిల్ లేక నిరుపయోగంగా జనరేటర్

భారంగా మారిన ఆస్పత్రి నిర్వహణ

- ఆరోగ్యశ్రీ నిధుల విడుదలలో జాప్యం
- సుమారు రూ.70 లక్షలు ఆగిన వైనం
- కనీస సదుపాయాల కోసం ఎదురుచూపులు
- అప్‌గ్రేడ్ అయినా అందని ద్రాక్షలా వైద్యం
- జిల్లాలోని ఆస్పత్రుల పరిస్థితి ఇదే..

ఇల్లెందు: ప్రతీ రోగిని ఆరోగ్యశ్రీ ద్వారా పరీక్షించడం, దాని ద్వారా లభించే నిధులతో ఆస్పత్రి ఆలనా– పాలనా సాగాలి. అయితే గడిచిన ఏడాదిన్నర కాలంగా ఆరోగ్యశ్రీ నిధుల విడుదతో జాప్యం కారణంగా ఆస్పత్రి నిర్వహణ బహుభారంగా మారింది. ఆరోగ్యశ్రీలో అందించిన వైద్యానికి ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధులతో ఆస్పత్రి నిర్వహణ చేసుకోవాలని నిబంధన ఉండగా.. ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు ఆరోగ్యశ్రీ కింద సుమారు రూ.70 లక్షలు నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఒక్క ఇల్లెందు ఆస్పత్రికే కాదు జిల్లాలోని ఇల్లెందు, పాల్వంచ, బూర్గంపాడు, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రులకు ఇదే పరిస్థితి.

ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయినా..

ఇల్లెందు ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయినా.. ఆరోగ్యశ్రీ నిధులు విడుదలలో జాప్యం జరుగుతోంది. ఇక్కడి రోగులకు సరైన వైద్యం అందించేందుకు తగిన సదుపాయాలు లేకపోవడంతో ఆస్పత్రి నిర్వహణ నీరుగారుతోంది. ఇల్లెందులోని 30 పడకల ఆస్పత్రికి మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకొచ్చి 10 నుంచి 15 మంది వరకు డాక్టర్లను నియమించారు. అనూహ్యంగా మళ్లీ 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కూడా చేశారు కానీ ఇందుకు తగిన సదుపాయాలు కల్పించడం మరిచారు. ప్రత్యేక వైద్య నిపుణులు ఉన్నా.. ఆశించిన వైద్యం అందడం లేదు. ప్రతీ రోజు 500 మంది రోగుల ఓపీ తాకిడి ఉంటుంది.


పెరిగిన కాన్పులు, ఆపరేషన్‌లు..

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాల వైద్య విధాన పరిషత్‌లోకి మారిన తర్వాత ఏడుగురు ప్రత్యేక వైద్యనిపుణులు, నాలుగురు జనరల్ డాక్టర్లు సేవలు అందిస్తున్నారు. కాగా, గతంలో ఎన్నో ఏళ్లుగా స్త్రీ ప్రసూతీ ప్రత్యేక వైద్య నిపుణులు లేక గర్భిణులకు సరైన వైద్యం అందక కొత్తగూడెం, ఖమ్మం వెళ్లాల్సి వచ్చేది. ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయిన తర్వాత స్త్రీ ప్రసూతి వైద్యులు రావడంతో ప్రసవాలు, ఆపరేషన్లు సాగుతున్నాయి.

అందుబాటులో లేని పరికరాలు..

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో ఏడుగురు ప్రత్యేక వైద్య నిపుణులు ఉన్నారు. సరైన వైద్యం అందించాలంటే అందుకు తగిన సదుపాయాలు ముఖ్యంగా పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అవి ఇక్కడ ఏర్పాటు చేయలేదు. ఆస్పత్రికి కావాల్సిన పరికరాలు సీఏఆర్ఎం–1, డ్రిల్లింగ్ యంత్రం –1, డెంటల్ చైర్–1, స్లిప్ ల్యాంప్–1, ఏఆర్ మిషన్–1, మైక్రోస్కోప్–1, ల్యాప్రోస్కోపిక్–1 లేవు. అంతేకాక ఆస్పత్రిలో జనరేటర్ ఉన్నా.. డీజిల్‌కు నిధులు కొరత తీవ్రంగా ఉండడంతో నిరుపయోగంగా మారింది. ఇక అంబులెన్సు కూడా లేదు. కాగా, ఐటీడీఏ నుంచి సమకూరుస్తామని పీఓ ప్రతీక్ జైన్ హామీ ఇచ్చారు.


నిధులు కేటాయించాలి..



ఆస్పత్రిలో రోగులకు సకల సదుపాయాలు అందాలంటే సరిపడా నిధులు ఉండాలి. నిధులు లేక ఆస్పత్రి నిర్వహణ కష్టంగా మారింది. అంతేకాక ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు అందించిన వైద్యం కింద విడుదల చేయాల్సిన నిధులు కూడా అందలేదు. నిత్యం డయాలసిస్ కోసం వచ్చే రోగులతో పాటు ఇతర రోగులకు సరిపడా నిధులు లేక వైద్యం అందించలేకపోతున్నాం.

– కటకం దయాకర్, డయాలసిస్‌రోగి, ఇల్లెందు

నిధులుంటేనే మెరుగైన వైద్యం..



ఆస్పత్రి నిర్వహణ సరిగా ఉండాలంటే నిధులు అందుబాటులో ఉండాలి. గతేడాదిన్నర కాలంగా ఆరోగ్యశ్రీ కింద అందించిన సేవలకు సుమారు రూ.70 లక్షలు నిధులు విడుదల కావాల్సి ఉంది. ఇటీవల హెల్త్ డైరెక్టర్ అజయ్‌కుమార్ ఆస్పత్రిని సందర్శించినప్పుడు ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయాలని లిఖిత పూర్వకంగా లేఖ అందజేశాం. నిధులు సమకూరితే సదుపాయాలు కల్పించే అవకాశం ఉంది.

–డాక్టర్ జి.హర్షవర్ధన్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, ఇల్లెందు

చికిత్స పొందుతూ యువకుడు మృతి

రఘునాథపాలెం: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటనపై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం నగర శివారు బాలాపేటతండాకు చెందిన పలువురు యువకులు ఈ నెల 5న డీజేలు తీసుకొచ్చేందుకు ట్రాలీ ఆటోలో రఘునాథపాలెం మండలం రాంక్యాతండా వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గ్రామ సమీపంలో ట్రాలీ పల్టీ కొట్టడంతో ఐదుగురు యువకులు గాయపడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ధరావత్ వికాస్ (18)ను హైదరాబాద్ తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆటోడ్రైవర్‌గా పనిచేసే ధరావత్ నాగులు, బుజ్జి దంపతుల పెద్ద కుమారుడైన వికాస్ ఇంటర్ చదివాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

రఘునాథపాలెం: ఇటీవల విడుదలైన ఎప్‌సెట్ (ఎంసెట్) ఫలితాల్లో ర్యాంక్ తక్కువ రావటంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వి.వెంకటాయపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీహరి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లగాని శ్రీను చిన్న కుమార్తె మేఘన (19) ఇంటర్మీడియట్ చదివింది. హైదరాబాద్‌లో ఎప్‌సెట్ (ఎంసెట్) కోచింగ్ తీసుకున్నప్పటికీ శనివారం విడుదలైన ఫలితాల్లో ఆశించిన స్థాయిలో ర్యాంక్ రాలేదు. దీనికి తోడు అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మనస్తాపానికి గురై ఆదివారం తెల్లవారుఝామున ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అరెస్టయిన నేతలను కోర్టుకు తరలించాలి

ఇల్లెందురూరల్: వరంగల్‌లో అరెస్టయిన న్యూడెమోక్రసీ అజ్ఞాత దళాల నాయకులను వెంటనే కోర్టులో హాజరుపర్చాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. వరంగల్ పట్టణంలో న్యూడెమోక్రసీ అజ్ఞాత దళాల నాయకులు రాజన్న, దేవిరెడ్డి, జీవన్‌లతో పాటు మరో నలుగురిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. వారికి ఎటువంటి ప్రాణహాని తలపెట్టకుండా కోర్టుకు తరలించాలని కోరారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ఇల్లెందు: పట్టణంలోని కాకతీయనగర్‌కు చెందిన ప్రమీల అనే యువతి ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి ఆపై ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా యువతి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.